క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలు మంగ, గోదాదేవి సమేత వైభవ వేంకటేశ్వర స్వామికి స్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలను ఆదివారం వైభవంగా చేశారు. తెల్లవారుజామున స్వామికి పంచామృతాభిషేకం చేసిన అనంతరం భక్తుల దర్శనార్థం అనుమతించారు. అర్చక బృందం స్వామిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

'కథాకళి' చిత్రీకరణ ప్రారంభం

కపిలేశ్వరపురం: మాన్యతా ప్రొడక్షన్ బ్యానర్‌లో నిర్మిస్తున్న కథాకళి సినిమా చిత్రీకరణను ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. కపిలేశ్వరపురం పంచాయతీ కార్యాలయ వద్ద కెమెరా స్విచ్ ఆన్ చేసి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కలిదిండి రవికిరణ్ నిర్మాణ సారథ్యంలో ప్రసన్నకుమార్ నాని దర్శకత్వంలో చిత్రం రూపుదిద్దుకుంటుంది. చిత్రం డీఓపీగా జితిన్ మోహన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కూన ఉపేంద్ర, కాస్ట్యూమ్ డిజైనర్ రాచకొండ ముగ్ధ, ప్రొడక్షన్ డిజైనర్ గువ్వల నాగేంద్ర, సంగీత డైరెక్టర్ పవన్ చిత్రం తాలూకు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, మాజీ వైఎస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, స్థానిక నాయకులు బలవరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

వరి విత్తనాలను సరఫరా చేయాలి

కాజులూరు: రైతులకు అవసరమైన వరి విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం కాజులూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ ఏటా రైతులకు నాణ్యమైన విత్తనాలు లభించకపోవటంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కొందరు రైతులు వరి విత్తనాలను సొంతంగా పండిస్తున్నప్పటికీ మండల గ్రామాల్లో రైతులకు సరఫరా సరిపోవడం లేదని దీంతో రైతులందరూ బయట మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించి విత్తనాలను కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఉచితంగా సరపరా చేయాలన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్ స్టేషన్‌లోని వల్లూరు ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు ఆదివారం తెలిపారు. ఫీడర్ పరిధిలో ఆర్‌ఎస్‌ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో వల్లూరులో ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులంతా ఈ-కేవైసీ చేయించుకోవాలి

కాజులూరు: అన్నదాతా సుఖీభవ పథకం కోసం అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గొల్లపాలెం రైతుసేవా కేంద్రంలో ఆదివారం ఆయన రైతులతో మాట్లాడుతూ గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది ఈ-కేవైసీ నమోదు చేస్తున్నారన్నారు. రైతులందరూ రైతు సేవా కేంద్రానికి వచ్చి వేలిముద్రలు వేయడం ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. స్థానికంగా పొలాలు కలిగి ఉండి ప్రస్తుతం అందుబాటులో లేనివారు తమకు సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి కూడా ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం, సెల్‌ఫోన్ నంబర్ల ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవచ్చన్నారు. ఈ-కేవైసీ లేని పక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే అన్నదాతా సుఖీభవ పథకం డబ్బులు పడటంలో ఇబ్బందులు ఎదురౌతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతుసేవా కేంద్రం వీఏఏ వనుం రమ్య, శలపాక రైతుసేవా కేంద్రం వీఏఏ వి.అనూష పలువురు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు



గంధోత్సవాన్ని నిర్వహిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలోని జబ్బా బేబీ ఫాతిమా అమ్మవారి గంధోత్సవం (ఉరుసు) అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఫాతిహా కమిటీ సభ్యులు, ముస్లింల పిలుపు మేరకు టీడీపీ నేత వాసంశెట్టి సత్యం, జనసేన పార్టీ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌లు ఈ ఉత్సవంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. షేక్ జిలాని, షేక్ వలీ, షేక్ బషీర్, షేక్ సంధాని, షేక్ జమాల్, ఎండీ యాకూబ్, ఎండీ నౌషాద్ బాబు, షాబాజియా, మసీద్ ప్రెసిడెంట్ సయ్యద్ ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు సాగునీరు పారేదెలా..?

- పూడుకుపోయిన కాలువలు
- ముంచుకొస్తున్న తొలకరి సీజన్
- కలవరపడుతున్న రైతులు



టి.మామిడాడలో స్లూయిజ్ వద్ద నీటి ప్రవాహానికి అడ్డుగా పెరిగిన గుర్రపుడెక్క



గొల్లపాలెంలో పూడికతో మూసుకుపోయిన పంట కాలువ

కాజులూరు: డెల్టా ప్రాంతంలోని వ్యవసాయ భూముల్లో 90 శాతం రైతులు ఖరీఫ్, రబీల్లో వరి సాగుకే ప్రాధాన్యం ఇస్తుంటారు. కొద్ది రోజుల్లో తొలకరి సాగు ప్రారంభం కానుంది. గోదావరి డెల్టా ప్రధాన కాలువల నుంచి పంటబోదెలు (పిల్ల కాలువలు) ద్వారా పొలాలకు సాగునీరు సరఫరా జరుగుతుంది. అయితే నియోజకవర్గ గ్రామాల్లోన్ని ప్రధాన కాలువలకు అనుసంధానంగా ఉన్న పంటబోదెల్లో పూడికలు పెరిగిపోయి అధ్వానంగా తయారవడంతో సాగునీరు పొలాలకు చేరడం కష్టతరంగా మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కోరంగి కెనాల్, ఇంజరం కాలువలకు అనుసంధానంగా ఉన్న సుమారు 200 పంట కాలువల ద్వారా ఈ పొలాలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. వారం రోజుల క్రితమే గోదావరి డెల్టా కాలువకు నీరు విడుదల చేశారు. అయితే పిల్ల కాలువలు కొన్ని చోట్ల పూడుకుపోయి ఉండగా మరి కొన్ని చోట్ల తూడు, గుర్రపుడెక్కతో మూసుకుపోయాయి. దీంతో పొలాలకు సాగునీరు సకాలంలో సరఫరా అయ్యే పరిస్థితులు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 62,500 ఎకరాల సాగుభూమి ఉండగా ఈ ఏడాది తొలకరిలో సుమారు 52 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టనున్నట్లు అధికారుల అంచనా..! గతంలో తొలకరి, దాళ్వా వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందే పంటకాలువల తవ్వకాలు జరిగేవి. నీటి తీరువా బకాయిలు, నీటి సంఘాల ద్వారా మంజూరయ్యే నిధులతో పాటు రైతుల స్వచ్ఛంద సహకారాలతో ఈ పనులు పూర్తి చేసుకునేవారు. ఆపై కొంతకాలంగా ఉపాధి పనుల్లో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది కూలీలతో పంటకాలువలను తవ్వకాలను నిర్వహిస్తున్నారు. అయితే ఉపాధి పనుల నిర్వహణలో సిబ్బంది వారి నిబంధనలకు లోబడి మాత్రమే కాలువల తవ్వకం పనులు నిర్వహించడంతో రైతన్నల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నీటిసంఘాలకు నిధులు ఇచ్చేవారని దీంతో అవసరమైన మేర కాలువలు తవ్వకునేవారమని ఆపై ఉపాధి పథకం ద్వారా కాలవలు తవ్వినా పైపైనే తవ్వకాలు జరగడంతో కాలువల్లో మెరక పెరిగిపోయి ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు చెబుతున్నారు. కొన్ని చోట్ల ప్రధాన కాలువల నుంచి పిల్ల కాలువలకు నీరు వచ్చే స్లూయిజ్‌ల వద్ద తూడు, గుర్రపు డెక్క దట్టంగా పేరుకుపోయాయి. పంట కాలువలు మూసుకుపోవడంతో ఏటా కాలువ శివారు ఉన్న భూములకు చుక్కనీరందక దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నామని కాలువ శివారు భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శివారుకు నీరందడం లేదు



పొలాలకు సాగునీరందించే పంటకాలువలు పూడుకుపోవటంతో శివారు భూములకు నీరందడం లేదు. ఫలితంగా కాలువనీరు వదిలినా వర్షాలు వస్తే కాని పంటదమ్ములు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

– నల్లమిల్లి అచ్చిరెడ్డి, రైతు, మొగలిపాలెం

కాలువలు తవ్వించాలి



పంటకాలువలు పూడుకుపోవటంతో నీటి ఎద్దడి సమయంలో కాలువ శివారు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. సాగు ప్రారంభించేలోపు పంటకాలువలను తవ్వాల్సిన అవసరం ఉంది.

– గోవాల కామరాజు, రైతు, గొల్లపాలెం

ఈ నెల 20లోపు బయోమెట్రిక్ వేయాలి



కొత్తూరు రైతు సేవా కేంద్రంలో బయోమెట్రిక్ కార్యక్రమంలో ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: ఈనెల 20వ తేదీలోపు రైతులు పీఎం కిసాన్ పథకానికి సంబంధించి రైతు సేవా కేంద్రాల వద్ద బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. మండలంలోని కొత్తూరు రైతు సేవా కేంద్రం వద్ద అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో భాగంగా ఏఓ సత్యప్రసాద్ రైతులతో బయోమెట్రిక్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ఈ నెల 20 లోపు భూమి ఏ ప్రాంతంలో ఉన్న సరే సమీప రైతు సేవా కేంద్రానికి ఆధార్ కార్డు పట్టుకొని వెళ్లి బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. మండలంలోని 7900 మంది రైతులను అన్నదాతా సుఖీభవ పథకంలోకి రావడం జరిగిందన్నారు. బయోమెట్రిక్ వేసిన వాళ్లకి మాత్రమే అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ పథకం వర్తించటం జరుగుతుదని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

'చేయూత' సేవలు అందరికీ ఆదర్శం కావాలి



బాలలకు న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: తలసేమియా బాధితుల కోసం రక్తదానం నిరుపేదలకు, గర్భిణులకు ఐదేళ్లుగా అన్నదానం, వినూత్న సేవలు అందిస్తున్న చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం స్థానిక బలుసు కల్యాణ మండపంలో చేయూత సంస్థ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదాతలను ప్రోత్సహిస్తూ వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రక్తదానం చేసిన వారికి రూ.లక్ష ఇన్సూరెన్స్ కల్పించడంపై చేయూత టీమ్‌ను ప్రశంసించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి తలసేమియా బాధితుల కోసం ఇప్పటివరకు 35 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించడంపై చేయూత వ్యవస్థాపకుడు మొండి రవికుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం 40 మంది ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఆత్మీయ స్పర్శ కార్యక్రమం ద్వారా న్యూట్రిషన్ కిట్లను మంత్రి సుభాష్ అందజేశారు.

'తల్లికి వందనం' అమలుతో ఆనందం : మంత్రి సుభాష్

ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకంతో తల్లుల మోముల్లో ఆనందం వెల్లివిరిసి కూటమి సర్కార్‌కు అమ్మలంతా వందనం చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక బలుసు కల్యాణ మండపంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 67.27 లక్షల మంది పిల్లలకు తల్లికి వందనం ఇచ్చామని, గత ప్రభుత్వం కేవలం 42 లక్షల మందికి ఇచ్చామని తెలిపారు.

కూటమి ఏడాది వైఫల్యాలపై నేడు పుస్తకావిష్కరణ

రామచంద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏడాది పాటు ప్రజలను మభ్యపెట్టిన కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు.

ఘనంగా వనుములమ్మ తీర్థం



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామదేవతగా పూజలందుకుంటున్న వనుములమ్మ వారికి జాతర, తీర్థ మహోత్సవాలు ఆదివారం నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. కమిటీ ఆధ్వర్యంలో యువత పంట పొలాల నుంచి తీసుకువచ్చిన రెండు తాళ్లను అమ్మవారి ఆలయం ఎదుట నిలబెట్టి పాతారు. ప్రత్యేక పూజలు అనంతరం తాళ్లకు ఊయల వేసి అమ్మవారికి ఊయల సేవ నిర్వహించారు. గరగ నృత్యాలు, చిత్ర విచిత్ర వేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

వికసిత్ భారత్ ధ్యేయంగా బీజేపీ పాలన



మొక్క నాటుతున్న బీజేపీ నేతలు

రామచంద్రపురం: వికసిత్ భారత్ ధ్యేయంగా గత 11 ఏళ్లుగా బీజేపీ కేంద్రంలో మోదీ నాయకత్వంలో అభివృద్ధి వైపు పాలన సాగిస్తుందని బీజేపీ నాయకులు అన్నారు. పట్టణంలో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. పట్టణ బీజేపీ అధ్యక్షుడు దినే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండపేట నియోజకవర్గం ఇంచార్జ్ వల్లభనేని రవీంద్రబాబు, రామచంద్రపురం నియోజకవర్గ కాజులూరు మండల అధ్యక్షుడు సలాది వీరబాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో నరేంద్రమోదీ 11 ఏళ్ల సుపరిపాలన లో వికసిత్ భారత్‌లో జరిగిన వివిధ రకాల సంక్షేమ పథకాల గురించి బీజేపీ నేతలు వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం కూడా నిర్వహించారు. బీజేపీ నేతలు కొట్టివాడ హరిబాబు కేశవ రాఘవేంద్ర, కుప్పెల సూర్యనారాయణ, కృష్ణమూర్తి, కొప్పిశెట్టి శ్రీనివాస్, నాగార్జున, పులిగడ్డ సురేష్, సలాది వీర వెంకట సత్యనారాయణ, సలాది సతీష్‌నాయుడు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెన



వత్రపూడిలో శిథిలావస్థకు చేరిన వంతెన

కె.గంగవరం: మండలంలోని అద్దంపల్లి-వత్రపూడిలో రహదారిలోని వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారిని నిత్యం వందలాంది మంది ప్రజలు ఉపయోగించుకుని అటు కాజులూరు మండలం, ఇటు కె.గంగవరం మండం, ద్రాక్షారమలకు చేరుకుంటారు. ఈ రహదారిలో వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరువైపులా రక్షణగోడలు కూడా లేవు. దీంతో వంతెన ప్రమాదభరితంగా మారిందని అప్పుడప్పుడు ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్‌కు స్థలం కేటాయించండి



ఎమ్మెల్యే వేగుళ్లతో మాట్లాడుతున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): పెన్షనర్స్ బిల్డింగ్ నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని మండపేట పెన్షనర్స్ అసోసియేషన్ యూనిట్ నాయకులు కోరారు. ఆమేరకు శనివారం మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావును కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రతి నెలా పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికై మండపేట పట్టణంలో సమావేశాన్ని నిర్వహించుకుంటున్నామని మండపేట శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దేవళ్ళ సత్యనారాయణ, కార్యదర్శి పెంకే గోవిందరావు చెప్పారు. అసోసియేషన్‌కు సొంత భవనం లేక ప్రత్యామ్నాయ భవనాల్లో ఒక్కోసారి ఒక్కో భవనంలో సమావేశాలను నిర్వహించుకుంటున్నామన్నారు. తమ అవస్థలను దృష్టిలో పెట్టుకుని పెన్షనర్స్ బిల్డింగ్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని నాయకులు కోరారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యాన స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ నిర్వ హించారు. స్వామివాని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఏకాదశ, లఘున్యాస అభిషేకాల్లో 40 మంది పాల్గొన్నారు. శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 23 జంటలు, పంచామృతాభిషేకాల్లో 5 జంటలు పాల్గొన్నా యి. ఐదుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం , ఆరుగురు చిన్నారులకు తులాభారం, ముగ్గురు చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. ఐదుగురు భక్తులు తలనీలాలు సమర్పించారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది'

- ఈ నెల 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- క్లస్టర్ పరిధిలో 425 అంగన్‌వాడీ కేంద్రాలు



మాచవరంలో అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుంది. మరో వైపు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రవేశాన్ని కల్పించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ వరకు 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల ఉజ్వల భవితకు బాటలు వేస్తున్నాయి. బుడిబుడి అడుగులు వేసే దశలో అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో తోడ్పాటు అందిస్తున్నాయి. ఆయా కేంద్రాలకు వచ్చే చిన్నారులకు విద్యతో పాటుగా, పోషకాహారం సైతం అందిస్తున్నారు. పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడుతున్న వారికి అదనపు ఆహారం ఇస్తూ ఆరోగ్యంగా ఎదిగేలా కృషి చేస్తున్నారు. తాజాగా అంగన్వాడీ కేంద్రాల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం పరిధిలో 423 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు.

ఆటపాటలతో చదువు

విద్యార్థులపై ప్రస్తుతం ఉన్న ఒత్తిడి అంతా ఇంతా కాదు. మార్కులు, ర్యాంకులే లక్ష్యంగా సాగిపోతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య చదువుతున్న చిన్నారులు సైతం నలిగిపోతున్నారు. అదే అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఒత్తిడి లేని విద్య అందించడమే లక్ష్యంగా నిర్దేశించారు. ఈ మేరకు చిన్నారుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందించే కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఆటలు, పాటలు, కథలతో చిన్నారులకు చదువు నేర్పిస్తున్నారు. పోషకాహారం సైతం అందిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులను కేంద్రాలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు.

విద్యతో పాటు పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు గ్రామీణ ప్రాంతాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం సైతం అందజేస్తున్నారు. రోజూ ఉదయం గుడ్లు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం చిక్కీలు ఇస్తారు. ఆర్థిక ఇబ్బందులతో తమ పిల్లలకు పౌష్టికాహారం అందించలేకపోతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు అంగన్వాడీ కేంద్రాలు వరంగా మారాయి. ఆటలు, పాటలు, కథలతో పాటు సంభాషణలు నేర్పిస్తారు. మంచి అలవాట్లు అలవడేలా చొరవ చూపుతారు. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు.

17వ తేదీ వరకూ

ఈ నెల 12న సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. 17వ తేది వరకు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. తద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల అడ్మిషన్ల సంఖ్యను పెంచనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల వయస్సు ఆధారంగా ఆటపాటలతో బోధన ఉంటుంది. మూడు, నాలుగేళ్ల వయస్సు చిన్నారులకు పీపీ1, పీపీ2 స్థాయిలో తెలుగు, ఇంగ్లీషు, గణితం తదితర పాఠ్యాంశాలను బోధిస్తారు.

క్లస్టర్‌లో పరిస్థితి ఇదీ

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రామచంద్రపురం, మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలు ఉన్నాయి. క్లస్టర్ పరిధిలో 419 అంగన్‌వాడీ కేంవద్రాలు, ఆరు మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 2,112 మంది గర్భిణులు, 1,806 మంది బాలింతలు ఉన్నారు. అలాగే 1,669 మంది ఆరు నెలల లోపు చిన్నారులు, 8,791 మంది ఏడు నెలల వయస్సు నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు ఉండగా, మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 6,208 మంది ఉన్నారు.

క్లస్టర్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు
రాయవరం	70
మండపేట	94
కపిలేశ్వరపురం	78
రామచంద్రపురం	105
కె.గంగవరం	78

స్పందన బాగుంది



అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం పట్ల తల్లిదండ్రుల నుంచి స్పందన బాగుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం చేపట్టడంతో పాటుగా, అడ్మిషన్ల చేపడుతున్నాం. ఇంటింటికీ వెళ్లి చిన్నారులను కేంద్రాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

– డి.ఆదిలక్ష్మి, అంగన్‌వాడీల సంఘ అధ్యక్షురాలు, పసలపూడి

తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి



తల్లిదండ్రులు వారి చిన్నారులను సమీపంలోని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంతో పాటుగా, చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం కొనసాగుతుంది.

– అధికారి గజలక్ష్మి, పీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, మండపేట

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిదలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. రూ.30 లక్షల పంచాయతీ నిధులతో సీసీ రహదారులు, డ్రైయిన్ల నిర్మాణాలకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రూ.9 లక్షలతో చేపట్టనున్న ఇరిగేషన్ డ్రైయిన్ మెయింటెనెన్స్ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.40 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రహదారులు, డ్రైయిన్లను ప్రారంభించారు. రూ.30 లక్షల ఎన్ఆర్ఈజీసీ నిధులతో నిర్మించిన 12 సీసీ రహదారులను ప్రారంభించారు. రూ.16 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్లను ప్రారంభించారు.

కొత్త పింఛన్ల మంజూరులో ప్రభుత్వ నిర్లక్ష్యం



మందపల్లి రవికుమార్

కపిలేశ్వరపురం (మండపేట): కొత్త పింఛన్లు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఆర్టీఐ యాక్ట్ విభాగం అధ్యక్షుడు, మండపేట పట్టణ 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ అన్నారు. ఏడాది కాలంగా నిరుపేదలైన అర్హులు నూతన పింఛన్లు మంజూరు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం కనీసం మంజూరు మాట ఎత్తకుండా కాలం గడుపుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులకు పింఛన్లు మంజూరు నిరంతర ప్రక్రియగా జరిగేదన్నారు. అర్హులు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవడమూ, అధికారులు పరిశీలించి మంజూరు చేయడం సజావుగా త్వరితగతిన సాగేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మానవత్వంతో స్పందించి వికలాంగ, వితంతు, ఒంటరి మహిళ, చర్మకార, డప్పు కళాకారులు, హెచ్‌ఐవీ, కిడ్నీ డయాలసిస్ బాధితులు, 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు పింఛన్ మంజూరు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సదరన్ సర్టిఫికెట్లు జారీ ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.